వాడు నిర్లక్ష్యంగా వెళ్ళమన్నట్టు సైగ చేశాడు.

"ఎంత పొగరు వీడికి ?"

అక్కడే మరి కొంచెం అవతల నువ్వు చేలకు నీళ్ళు తోడుతోన్న పనివాళ్ళు కనిపించారు. ఆజ్ఞాపించటమే తడవు వాణ్ణి చెట్టుకి కట్టారు.

ఎంత కొట్టినా మాట్లాడేం! ఎంత పొగరు! కొట్టి కొట్టి చేతులు నొప్పులు పుట్టేక గుర్రం ఎక్కి గజ్జెల తన గుర్రంవైపు దౌడు తీశారు రాజావారు.

కనుచూపు మేర పచ్చటి పైరు పొలాలు. పొలం గట్ల చుట్టూ కొబ్బరి మొక్కలు, బోర్డర్లా ఎదిగి శ్రీ రంగనాధరావుగారి పొలంలో ఏలోటూ రాకుండా బతుకు సాగిస్తున్నందుకు గర్వంగా గాలిలో తలలు ఎగరేస్తున్నాయి.

ఆ పొలాల మధ్య పుంత. పుంతకి ఇరువైపులా తాటిమట్టలు, విచ్చుకత్తుల్లా... విరుచుకు పడబోతోన్న ప్రమాదంలా వున్నాయి. కొత్త గుర్రం ఒళ్ళుమరిచి పరుగెత్తుతోంటే, మరింత రెచ్చిపోయి కొరడాతో 'చెళ్ చెళ్' మని బాదుతున్నారు రాజావారు. విఠలాచార్య సిన్మాలాగా రాజకుమారుళ్ళా దౌడు తీస్తూ వుంటే— దుమ్ము చెట్ల మీద పొగమంచులా పరుచుకుంటోంది. 'అన్ ట్రెయిన్డ్ హార్స్' అంటారు, అందుకేనేమో! ఆ కొత్తగుర్రం దారి మాని పక్కనున్న తాటి మట్టలవైపు దౌడు తీసింది. అంత వరకే తెలిసింది శ్రీవారికి. అటుపై జరిగిందంతా వారి తెలివికి అతీతంగా జరిగిందే!

తెలివి వచ్చేటప్పటికి ఒళ్ళంతా కట్లుతో ఇంట్లో పక్కమీద పడివున్నారు. కదలబోతే కలుక్కున దెబ్బలన్నీ కత్తుల్లా పొడిచాయి.



# సహనానికి సరిహద్దులు

కె.కె.మీనన్

"ఏమిటిది ?" అడిగారు అమాయకంగా మాటకూడ ఏదో పీలసంగా, నూతిలోగొంతులా రావటం ఆయనకుకూడ ఆశ్చర్యం కలిగించింది

'తమరు గుర్రం మీంచి పడిపోయారండి. ఒళ్ళంతా తాటి మట్టల్లో చీరుకుపోయిందండి' అన్నాడు మంగలి సుబ్బన్న.

"నాకు తెలీదే ?"

"తమరికి స్పృహ లేదండి"

"మరిక్కడికెలా వచ్చాను ?"

"వీరడు మోసుకొచ్చాడండి"

(30 వ పేజీ చూడండి)

# సహనానికి సరిహద్దులు

(23వ పేజీ తరువాయి)

"ఎవడా వీరడు?"

"వాడో దిక్కులేని వాడండి. వూరూరా తిరిగి అడుక్కుంటూవుంటాడు"

"వాణ్ని పిలిపించండి" ఆజ్ఞాపించారు.

"ఎక్కడున్నాడో ఏమో! ఎక్కడని వెతుకుతాం"

"ఈ దేశంలోనే వుంటాడా?"

తమరు కోప్పడితే ఏమీ చెప్పలేనండి. వాడు అడుక్కునే వాడండి. వాడికో చోటని లేదు అందుకని అలాగ మనవి చేసుకున్నానండి. ఈ వూళ్ళోనే ఎక్కడో వుండి వుంటాళ్ళండి."

"మరేం ఒళ్ళు తీటా వెతకడానికి?"

"చిత్తం"

"ఏమిటి"

"క్షమించండి, అలాగే వెతికి పట్టుకొస్తానండి"

వెతక్క తప్ప లేదు.

ఊళ్ళోనే వుంటాడని విశ్వసించిన వాళ్ళు పక్క ఊళ్ళో కూడా పట్టుకోలేకపోయారు వీరన్నని, నాలుగు రోజుల తర్వాత ఎలాగో పట్టుకుని రాజావారి ముందు హాజరు పరిచారు.

వీరన్నను చూడగానే నిప్పులు కురిసే ఆ కళ్ళనుంచి నీళ్ళుకారాయి.

"కూర్చో"

వాడు కూర్చోలేదు.

"తప్పు బాబుగారూ, తమరి ముందు కూర్చో కూడదు" అన్నట్టు సైగ చేశాడు భయం భయంగా. అప్పటికి కొంత వరకూ అర్థమైంది రాజా వారికి.

"వీడికి మాట్రాలావా?"

"పాపం మూగవాడండి" చెప్పాడు సుబ్బన్న.

ఆ మాట విన్నాక పూర్తిగా అర్థమైంది. పశ్చాత్తాపంతో రాజావారి కడుపు దేవి నట్టయింది

ఇది తా వెనకటి గాథ.

ఇప్పుడు రాజావారి కథే మారి పోయింది.

వెర్రి వీరన్న ఇప్పుడు రంగనాధరావు గారి అంతరంగిక సలహాదారు. ఎవరికీ అర్థం కాకుండా ఆయనకు మాత్రమే తెలిసేట్టు చెప్పగలిగే భాష వీరన్నకుంది. వీరన్న ఎలా చెప్పినా అర్థం చేసుకోగలిగే ప్రజ్ఞా పాటవాలూ అలవడ్డాయి రంగనాధరావు గారికి. దాంతో వారి వ్యవహారాల్లో చాలా మార్పులువచ్చాయి. అందులో మొట్టమొదటిది రంగసానిని తన్ని తరిమెయ్యటం.

అదెలా జరిగిందంటే—

ఓ సారి రంగనాధరావు గారు గ్రామాంతరం వెళ్ళటం జరిగింది. ఆ తరుణంలో వారి అంతరంగికుడు శ్రీ వీరన్న గారు పొలం పర్యవేక్షణకు వెళ్ళారు అదే సమయంలో, రంగసాని జాతకం మూడి రంగనాధరావు గారి ఏకైక పుతుడితో సరసాలాడటం అతగాడి కంటపడింది. అంతే! రంగనాధరావు గారు వూరికి తిరిగి రాగానే

"అమెను వెంటనే పంపెయ్యండి" అన్నాడు వాడి బాషలో,

ఎందుకని ఎదురు ప్రశ్న వెయ్యలేదు, రంగసాని కట్టుబట్టల్తో వెళ్ళిపోవాల్సి వచ్చింది రంగసాని నిష్క్రమణకు వీరన్నే కారణం అని తెలిశాక రాజావారి బంధు వర్గంలో వీడో సి ఐ.డి. అయిపోయాడు. అంతకు ముందు వాడంటే మండి పడే అమ్మగారికే వాడంటే ఎనలేని గురి ఏర్పడింది. ఒకప్పుడు వీరన్న అంటే ఆమెకు చెప్పలేని కోపం.

ఎందుకంటే—

వీరన్నని కొత్తగా అక్కడికి తెచ్చిన రోజుల్లో వాడికి వీధిలో భోజనం పెట్టేవారు. ఒకరోజు కూరకు బదులు ఒట్టి ఆవకాయ పచ్చడితోనే భోజనం పెట్టినందుగ్గాను రాజావారికి భాషలేని ఫిర్యాదు వెళ్ళింది, దాంతో రాజావారు మండిపడి వంట మనిషిని జువ్వ కర్రతో బాదారు. అడ్డం వచ్చిన అమ్మ

గారికే తప్పలేదు. అప్పట్నుంచీ వీరన్న అంటే ఆమెగారికి ఎక్కడలేని కోపం.

ఇక వారి వ్యవహారాల్లో జరిగిన రెండో మార్పు—

దుబారా ఆగిపోవటం. ఏటా రెండెకరాలు తరగటం మొదలెట్టిన రాజావారి ఆస్తి ఆకస్మికంగా ఆగిపోయింది. కొంత కాలం అలా నిలిచి ఆ తర్వాత మళ్ళీ పెరగటం ఆరంభించింది.

ఇక అసలు మార్పు మౌలికమైంది.

అదే రాజావారు నైతికంగా మారిపోవటం. అకారణంగా కోప్పడటం, పేదవాళ్ళని హింసించటం, ఇలాంటి వన్నీ కలలోని విషయాలుగా మారిపోయాయి పైగా పేదవాళ్ళంటే ఎక్కడలేని ప్రేమా పుట్టుకొచ్చింది. అందుకూ ఓ కారణం లేకపోలేదు.

అదేమిటంటే—

రాజావారు గుర్రం మీంచి పడిపోయినప్పుడు చూసిన వారిలో తమ దాయాదులూ వున్నారట. కాని వారెవరూ ఆయన్ని లేపి ఇంటికి చేర్చే ప్రయత్నమే చేయలేదట. అడుక్కుతినే వీరడు, అందులోనూ అప్పటి వరకూ తనచేత చావు దెబ్బలు తిన్నవాడూ, వాడికే ఎందుకు తనని కాపాడాలనే ఆలోచన వచ్చింది. ? అంటే వాళ్ళలో మానవికవికమైన క్షమ, ఆదరణ సహజంగానే వున్నాయన్నమాట.! వాళ్ళే అసలైన మానవులు - ఇలా తర్కించుకుని చివరికి వాళ్ళమీద ప్రేమని పెంచుకున్నారు.

రాజా రంగనాధరావుగారి వ్యవహారాల్లో ఇన్ని మార్పులు తెచ్చిన ఆ అనామకుడు అర్ధాంతరంగా ఒకనాడు కాలం చేశాడు. అదీ మామూలు చావు కాదు. దారుణ హత్య. నోరులేని ఆ అమాయకుణ్ణి చంపటానికి చేతులెలా వచ్చాయోనని వాపోయారు జనం. పొలంలో, వరి నూర్పుల కళ్ళం దగ్గిర అతని శవం రక్తపు మడుగులో పడి వుంటడం అనేక అనుమానాలకి దారి తీసింది. ఎవరైనా ధాన్యం తస్కరించబోతుంటే వీరన్న వారించి వుండవచ్చు. లేదా దోపిడీ దార్ల ఆటలు కట్టినందుకు కసితో పనివాళ్ళే ఎవరైనా చంపి వుండవచ్చు. ఎంతమందికి ఎన్ని అనుమానాలు వున్నా రంగనాధరావుగారికి వుండాల్సిన అనుమానం వేరేవుంది. రెండు నెలలు నిద్రాహారాలు మాని ఆ అనాధ భిక్షుకుడి కోసం ఏడ్చాడాయన.

ఇది జరిగి అప్పుడే అయిదారేళ్ళు కావస్తోంది. వెర్రి వీరన్నను చాలా వరకూ మర్చిపోతున్న తరుణంలో, అతన్ని మర్చిపోకుండా చేసే సంఘటన ఒకటి జరిగింది అదే—రంగనాధరావుగారికి మనవడు పుట్టటం. మనవడికి ఎంతకాలానికీ మాటలు రాకపోయేప్పటికి వీరన్న వారినీ వారి కుటుంబాన్నీ వొదలి వెళ్ళలేక మనవడి రూపంలో తిరిగి వచ్చాడనే బలమైన సెంటిమెంటును పెంచుకున్నారు రంగనాధరావుగారు. ఆ సెంటిమెంటు ఎంత వరకూ దారి తీసిందంటే ఆ మూగవాణ్ణి ఇయన్టీ స్పెషలిస్టుకు చూపించాలంటే ఇష్టపడనంత వరకూ వెళ్ళింది. ఆ విషయంలో తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం పెరిగింది.

"నాన్నగారూ! మీ చాదస్తం చాలా దూరం పోయింది. మీకు మీ భక్తుడు వీరన్న అంటే అభిమానం ఉండవచ్చు కాదనను. కాని వాణ్ణి నా కొడుకులో చూసి సంతృప్తి పడాలనే ఆలోచనని నేను సహించను. నా కొడుకును మూగవాడిగా చూడలేను."

"మూగ వాడూ మనిషే. అందులోనూ మామూలు మనిషికంటే గొప్పవాడు." అన్నారు.

"నాకు సహనం చచ్చిపోతోంది, నా కొడుక్కి ఆపరేషన్ చేయించక తప్పదు. మీరీ విషయం బాగా ఆలోచించాలి."

"అక్కర్లేదు. నేను బతికి వుండగా మాత్రం అది జరగదు."

"అదీ నిజమే"

"అవును అదే నిజం."

అదే నిజమైంది. ఆ మర్నాటి వుదయం రంగనాధరావుగారు మరి లేవలేదు. ఎందుకు లేవలేదనేది ఆ యింట్లో ఇద్దరికే తెలుసు. ఆ యిద్దరూ, రంగనాధరావుగారి కొడుకు రఘుమోహన్, కోడలు ప్రమీల.